మట్టిదారులే దిక్కాయె..

- మంజూరుకే పరిమితమైన పిడెంపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల రోడ్లు
- అగ్రిమెంట్‌తోనే ఆగిన పనులు.. గుంతలమయంగా రోడ్లు
- వాహనదారులకు తప్పని అవస్థలు


కోతకు గురైన ఉల్లిగుండం రహదారి (ఫైల్)


పిడెంపల్లి మట్టి రోడ్డు (ఫైల్)

దామరగిద్ద: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలంటారు. గ్రామాల అభివృద్ధికి మౌళిక సదుపాయాల్లో ప్రధానమైన రహదారులు మాత్రం అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. పలు గ్రామాలకు నేటికి మట్టి రోడ్లే శరణ్యం కాగా మరికొన్ని గ్రామాలకు ఏళ్ల క్రితం నిర్మించిన పంచాయతీ రోడ్లు కోతలకు గురై గుంతలు పడి మట్టి తేలిన బీటీరోడ్లు మరమ్మతులు చేపట్టక పోగా గ్రామీణ ప్రజలు నిత్యం నరక యాతన పడుతున్నారు. మండలంలో కర్ణాటక సరిహద్దు ప్రధాన రహదారి నుంచి ఉల్లిగుండం వరకు అక్కడి నుంచి అన్నాసాగర్, నర్సాపూర్ వరకు 11కిలోమీటర్ల మేరా బీటీ నిర్మాణానికి గత ప్రభుత్వం ఎంఆర్ఆర్ నిధుల నుంచి రూ. 1.80కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. కాగా గత రెండేళ్లుగా కేవలం మంజూరుకే పరిమితమైంది. కర్ణాటక సరిహద్దు రోడ్డు నుంచి ఉల్లిగుండం వరకు రోడ్డు గుంతలు పడి కోతకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్డు నుంచి విఠలపూర్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలు పడింది. రూ. 43లక్షలతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన పనులు ప్రారంభం కాలేదు. ఇక మద్దెల్‌బీడ్ ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు ఎంఆర్ఆర్ నిధులతో రోడ్డు మరమ్మతులకు రూ. 18లక్షలు మంజూరు చేసిన టెండర్ ప్రక్రియలోనే నిలిచిపోయాయి. ఇక మండల కేంద్రం నుంచి సజనాపూర్ వరకు నాలుగు కిలో మీటర్ల మేర గత 6సంవత్సరాల క్రితం బీటీ నిర్మించగా ఎటవాలు ప్రాంతాల్లో కోతలకు గురై రోడ్డు గుంతలు పడి అస్తవ్యస్తంగా మారింది.

– మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి గ్రామాలకు నేటికి మట్టి రోడ్లే శరణ్యంగా మారాయి. పీడబ్ల్యూ డీ రోడ్డు నుంచి లింగారెడ్డిపల్లి వరకు 1.5 కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులతో రూ. 90 లక్షలు మంజూరు చేసిన టెండర్ దశలోనే నిలిచింది. ప్రభుత్వం రహదారుల నిర్మాణం చేపట్టి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



కర్ణాటక సరిహద్దు రోడ్డు నుంచి గ్రామం వరకు 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలుపడి వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోతే అదుపు తప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నాం. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టి సౌకర్యం కల్పించాలి.

– రమేష్ ఆటో డ్రైవర్, ఉల్లిగుండం

తీవ్ర ఇబ్బందులు..



గ్రామానికి ప్రధాన రోడ్డు నుంచి 3 కిలో మీటర్లు మట్టిరోడ్డే ఉంది. వర్షాకాలం నీరు నిలిచి గుంతలమయంగా మారుతుంది. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వమైన రోడ్డు నిర్మాణం చేపట్టి సౌకర్యం కల్పించాలి.

– వీరారెడ్డి, లింగారెడ్డిపల్లి

వివిధ దశల్లో నిలిచిపోయాయి..



గతంలో మంజూరు చేసిన రోడ్డు వివిధ కారణాలతో వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఉల్లిగుండం నుంచి వయా, అన్నాసాగర్ నుంచి నర్సాపూర్ రోడ్డు నిర్మాణ దశలో ఉంది. లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి తదితర గ్రామాలకు నిధులు మంజూరుకాగా రిటెండర్ వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతాం.

– నర్సింగ్‌రావు, పీఆర్ఏఈ, దామరగిద్ద

క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయానికి హుండీ ఏర్పాటు



దామరగిద్ద: మండలంలోని ఎల్లమ్మతల్లి ఆలయంలో నూతన హుండీని ఊరేగింపుతో ఆలయానికి తరలించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక భజనతో హుండిని ప్రత్యేక వాహనంలో ఆలయానికి తరలించారు. దాత వన్నాడ వెంకటప్ప హుండీని అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని దర్శించే భక్తులు తమ కానుకలను హుండీలో వేసి ఆలయ అభివృద్ధి నిధిని సమకూర్చేందుకు హుండీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్నాడ చంద్రశేఖర్, ఉల్లిగుండం లక్ష్మప్ప అంజప్ప, గూద బస్సప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి కొళాయిలపై ఇంటింటి సర్వే



ఊట్కూరు: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి ఇచ్చిన నల్లా కనెక్షన్‌లపై మంగళవారం అధికారులు సర్వే నిర్వహించారు. ఈ మేరకు.. మేస్‌బజార్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో నల్లా కనెక్షన్ ఉన్న వారివి, లేని వారి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శెట్టి వెంకటేష్, కార్యదర్శి శ్రీనివాస్, కనకప్ప, పోలప్ప, పరుషరాం పాల్గొన్నారు.

'నీట్ ' లీకేజీపై విచారణ జరిపించాలి



మరికల్: నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని మంగళవారం ఎస్ఎఫ్‌యూఐ ఆధ్వర్యంలో మండలంలోని చౌరస్తాలో నిరసన నిర్వహించారు. ఎస్ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. నీట్ యూజీ ప్రవేశ పరీక్ష ఫలితాలు నోటిఫికేషన్ ప్రకారం విడుదల చేయకుండా అడ్డగోలుగా విడుదల చేయడంతో మార్కులు తక్కువగా రావడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోయారు. వెంటనే నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీశ్వర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ధన్వాడ: మండల కేంద్రంలోని మద్దెలమ్మ ఆలయంలో మంగవారం పద్మశాలి సంఘం, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి ఇష్టామైన రోజు కావడంతో ఉదయం అమ్మవారికి మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయభాను, మండల అధ్యక్షుడు బాలరాజు, ఉపాధ్యక్షుడు సురేందర్, వెంకట్రాములు, శ్రీనివాసులు, పూజారి లోకేష్, రంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

గోమాతను గోశాలకు తరలించిన పోలీసులు

మక్తల్: పట్టణంలోని ఎలాంటి ఆధారాలు లేకుండా గోమాతను వాహనంలో తరలిస్తున్న సమయంలో కొందరు యువకులు పోలీసులకు సమాచారమివ్వడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పట్టుకున్నారు. అనంతరం మండలంలోని పస్పుల సమీపంలో ఉన్న గోమాతాను గోశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో గజలమ్మ ఉత్సవాలు



నారాయణపేట: పట్టణంలోని అశోక్‌నగర్‌లోని గజలమ్మ ఆలయంలో గజలమ్మ జాతర మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ వీధుల నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలారు. డప్పుల చప్పుల మధ్య గొర్రెలు, కోళ్లు, మేకలను తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి ఎమ్మెల్యే ను సన్మానించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ ఎండి సలీం, గందె చంద్రకాంత్, సతీష్ గౌడ్, అఖిల్ రెడ్డి,సందీప్ రెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ సమీక్ష


సమీక్షలో వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీఓ

నర్వ: 14వ విడుత సామాజిక తనిఖీ సమీక్ష సమావేశం మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని 19గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై ఈ నెల 6నుంచి 17వరకు జరిగిన సోషల్ ఆడిట్‌పై ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ముఖ్య అతిథిగా డీఆర్డీఓ రాజేశ్వరీ సాయంత్రం హాజరైయ్యారు. ఉదయం 11గంటల నుంచి ప్రారంభమైన ఈ సమీక్షలో గ్రామాల వారిగా జరిగిన పనులు, సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అంశాలపై ఉపాధి సిబ్బందిని తనిఖీ అధికారులు ప్రశ్నించారు. మొత్తం మండల వ్యాప్తంగా ఉపాధి పనులలో కూలీల వేతనాలు రూ.2 కోట్ల 29 లక్షల6వేల 583రూపాయాలు కాగా మెటీరియల్ పేమెంట్ రూ.3 కోట్ల 26 లక్షల9 వేల344 రూపాయలు, మొత్తం రూ.2 కోట్ల 65 లక్షల, 65వేల 927రూపాయలు పనులు జరిగాయి. ఈ పనులపై రాత్రి వరకు గ్రామాల వారిగా సమీక్షలో ప్రజలకు వివరించారు. పనులలో జరిగిన అవతకతవకలపై ఉపాధి సిబ్బందికి జరిమానాలను విధించారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ సుదర్శన్, ఉపాధిహామీ సోషల్ ఆడిట్ సిబ్బంది, గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషిచేస్తా..


పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పుడే క్రమశిక్షణతో ప్రణాళికతో చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మణెమ్మ, దోమ సుధాకర్, విశాల్‌కుమార్, నారాయణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ కీర్తి

ధన్వాడ: నులిపురుగులను నిర్మూలిద్దామని ప్రభుత్వ వైద్య అధికారిణి డాక్టర్ కీర్తి తెలిపారు. మంగళవారం మండల పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీకార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు ఈ నెల 20న నులి పురుగుల నివారణ మందుల పంపిణీ వివరాలు వివరించారు. ఆమె మాట్లాడుతూ.. . ఈ నెల 20న జరగనున్న ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్‌సెంటర్ల ద్వారా ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శోభారాణి, పీహెచ్ఎన్ పద్మ, శ్రీదేవి, వరలక్ష్మి, విజయలక్ష్మి, అనురాధ, చంద్రకళ, శాంతితోపాటు ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మరికల్: తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని మంగళవారం రిషి ఉన్నత పాఠశాలను ఆమె ప్రారంభించారు. విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు మొదటి తరగతి నుంచే నాణ్యమైన విద్యకోసం పునాది వేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సూర్యమోహన్, శ్రీకాంత్‌రెడ్డి, హరీష్, రామకృష్ణ, యాదయ్యశెట్టి, కృష్ణయ్య, వీరన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేద్దాం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దామరగిద్ద: వానకాలం సాగు ప్రణాళిక, యాంత్రికరణ, సాగుమెలకువలపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 20న చేపట్టనున్న రైతు సదస్సుకు రైతులందరు హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నాడు. మంగళవారం మండలంలోని ఆశన్‌పల్లి, మల్‌రెడ్డిపల్లి, పిడెంపల్లి, గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు ఆదర్శ రైతులు హాజరై శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయ సాగు విధానం, వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలసాగు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అధిక సంఖ్యలో హాజరై సదుస్సును విజయవంతం చేయాలని కోరారు.

డెంగీ నిర్ధారణతో అధికారుల అప్రమత్తం


మందులు పిచికారీ చేస్తున్న సిబ్బంది

కోస్గి: పట్టణంలోని బహార్‌పేట కాలనీలో ఓ బాలుడికి డెంగీ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆడికే వీధికి చెందిన ఓ బాలుడు తీవ్ర జ్వరంతో అనారోగ్యానికి గురి కావడంతో వైద్యులు పరీక్షలు చేయించారు. బాలుడికి డెంగీ నిర్ధారణ కావడంతో గుండుమాల్ పీహెచ్‌సీ, మున్సిపల్ అధికారులు మంగళవారం బాలుడి ఇంటి పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని, మురుగును తొలగింపజేశారు. అప్పటికప్పుడు బాలుడి ఇంటి పరిసర ప్రాంతాలతోపాటు కాల నీలో దోమల నివారణ మందులు పిచికారి చేయించారు. డెంగీ వ్యాధి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



నారాయణపేట: జిల్లాలోని ఊట్కూర్ మండలం పెద్దపొర్ల గ్రామానికి చెందిన 'సంగీతా 'అనే మహిళ తన రెండో కాన్పులో పురుటి నొప్పులు ఎక్కువగా రావడంతో మంగళవారం రాత్రి 108కి సమాచారం ఇచ్చారు. వెంటనే ధన్వాడ 108 అంబులెన్స్ ద్వారా ఆశ వర్కర్ల సాయంతో పెద్దపొర్ల గ్రామానికి చేరుకున్నారు. వాహనంలో సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించే క్రమంలో ఊట్కూర్ స్టేజీ వద్ద అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డను జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి ఇద్దరు క్షేమంగా ఉన్నారని తెలిపారు. సిబ్బంది భరత్, ఆసిఫ్‌లను సంగీత బంధువులు అభినందించారు.

చిన్నారులకు పలకల పంపిణీ



నారాయణపేట రూరల్: మండలంలోని అమ్మిరెడ్డిపల్లి పంచాయతీ బసిరెడ్డిపల్లి పీఎస్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న శేర్‌కృష్ణారెడ్డి తన అన్న శేర్ సత్యనారాయణరెడ్డి కుమారుడు శేర్ నాగార్జున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. వేడుకల పేరుతో డబ్బులు వృథా చేయొద్దని సంకల్పంతో ఆ డబ్బులను తాను విద్యాబుద్ధులు చెబుతున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బీద విద్యార్థుల కోసం ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలకు సన్మానం



ఊట్కూరు: మండలంలోని ఉన్నత పాఠశాలలకు పదోన్నతులపై వచ్చిన జీహెచ్‌ఎంలకు తపస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేపట్టారు. పులిమామిడి జీహెచ్‌ఎం అనురాధ, పెద్దజట్రం జీహెచ్‌ఎం గౌరమ్మ, ఊట్కూరులో బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం మాధవి, బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం కుసుమలకు శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రవికుమార్, సంఘం నాయకులు నరేష్, మనిక్‌ప్రభు, నర్సింగప్ప, కృష్ణ, ధనుంజయ, నర్మద, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు ఇన్సూరెన్స్ అమలు చేయాలి

కృష్ణా: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ అమలు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ భుటో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆలంపల్లికి చెందిన పంచాయతీ కార్మికుడు రామప్ప మృతి చెందడంతో వారు ఆ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 5లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తాయప్ప, రాము, వెంకటేష్, జిందప్ప, మహాదేవప్ప, వాబయ్య, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు పశువుల సంత, తైబజార్‌లకు టెండర్లు

కోస్గి: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 20న గురువారం పశువుల సంత, తైబజార్‌లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు, ఇందుకుగాను టెండర్లకు సంబంధించి దరఖాస్తు గడువు బుధవారం (నేటి)తో ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ శశిధర్, చైర్ పర్సన్ అన్నపూర్ణ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాట నిర్వహించి అత్యధిక ధర పాడిన వారికి 9 నెలల కాలానికి టెండరు అందజేస్తామని,ఈ వేలంలో పాల్గొనదల్చిన అభ్యర్థులు పశువుల సంతకు రూ.2 లక్షలు, తైబజార్‌కు రూ.లక్ష మున్సిపాలిటీ కమీషనర్, కోస్గి పేరున డీడీలు తీసి ఈ నెల 19న సాయంత్రం 4 గంటల వరకు అందజేయాలని తెలిపారు. గడువు తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబోమని, పశువుల సంతకు రూ.50 లక్షల విలువైన స్థిరాస్తులను, తైబజార్‌కు రూ.10 లక్షల విలువైన స్థిరాస్తులను జామీనుగా అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న వ్యక్తి వేలం జరిగిన మూడు రోజుల్లోగా పాడిన వేలంలో నాలుగో వంతు మున్సిపాలిటీ నిధికి జమ చేయాల్సి ఉంటుందని, ఆసక్తి ఉన్న వ్యక్తులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కోయిల్‌సాగర్ నీటితో చెరువులు నింపాలి

మరికల్: తీలేర్ పంపుహౌస్ నుంచి డి-16 కెనాల్‌కు నీళ్లు వదిలితే ఆయాకట్టు పరిధిలోని చెరువులను నింపేందుకు అవకాశం ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు వేణు, రమేష్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని వదలడం మంచి నిర్ణయమన్నారు. తీలేర్ పంపుహౌస్ వద్ద డి-16 కాల్వకు నీటిని విడుదల చేస్తే మరికల్, అప్పంపల్లి, కన్మనూర్, మందిపల్లి, ఎలిగండ్ల, కంసాన్‌పల్లి, జిన్నారం గ్రామాల చెరువులను నింపేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి ఏడాది కూడా జూరాల నీటితోనే ఇక్కడి ప్రాంత చెరువులు నింపుతున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు సక్రమంగా కుర్వకపోవడంతో బోర్లలో భూ గర్భజలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోయిల్‌సాగర్‌కు వస్తున్న జూరాల నీటితో చెరువులను నింపితే భూ గర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు చొరవచూపి డి-16 కాల్వకు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా లింగమయ్య వేడుకలు

మక్తల్: మండలంలోని రుద్రసముద్రం, కర్నిలో లింగమయ్యస్వామి జాతర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు రాష్ట్ర ఓబీసీ బీజేపీ అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారిని ఆలయ తరపున శాలువాతో సన్మానం చేశారు.


ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వైభవంగా గ్రామ దేవతల జాతర

మక్తల్: మండలంలోని మాద్వార్, సామాన్‌పల్లి, సోమేశ్వర్ బండ, గ్రామాల్లో పోలేరమ్మ జాతర ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుతో వెళ్లి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పవిత్ర కృష్ణానీటిని తీసుకొచ్చి పోలేరమ్మకు పుష్కర స్నానం చేయించి పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో దండుగ్రామంలో మారెమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల, మంత్రోనిపల్లి గ్రామాల్లో మంగళవారం బోనాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుతో వెళ్లి జములమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలో మంగళవారం పోచమ్మబోనాలు ఘనంగా నిర్వహించారు. వైశాఖ మాసంలో గ్రామంలోని ఇంటింటి నుంచి డప్పు వాయిద్యాల మధ్య వీధుల గుండా మహిళలు ఊరేగింపు నిర్వహించి పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో గ్రామ ఎంపీటీసీ అనిత చెన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


గున్ముక్లలో బోనాలతో వస్తున్న మహిళలు

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్, దామరగిద్ద, కాన్‌కుర్తి తదితర అన్ని గ్రామాల్లో మంగళవారం పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక వంటకాలతో చేసిన నైవేద్యాలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు


కొత్తపల్లిలో..


సామాన్‌పల్లిలో..